ప్రజాశక్తి
బుధవారం 5 ఏప్రిల్ 2023
5
విజయనగరం

ఆర్‌డబ్ల్యుఎస్‌లో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖలో ఎంఆర్ అటానమస్ కాలేజీలో తృతీయ సంవత్సరం చదువుతున్న బిఎస్‌సి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. శాఖ పరిధిలో చేపడుతున్న మంచినీటి నిర్వహణ, నీటి శుద్ధి పరీక్షలు, కుళాయిలు, మంచినీటి ప్రాజెక్టుల నిర్వహణ తదితర అంశాలతోపాటు జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులపై ఆ శాఖ ఎస్‌ఇ బి.ఉమాశంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు హాజరైన విద్యార్థులతో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఉమాశంకర్

మండుటెండలో పనులు చేస్తున్న కూలీలు

గొంతెండిపోతోంది.. భూమి కాడనంటోంది.. పనులేమో దూరం... కిలోమీటర్ల మేర కాలినడక... పోనీ పని ప్రదేశాల్లో టెంట్లు, చలివేంద్రాలు లేవు... దెబ్బతగిలితే కట్టు కట్టుకునే మెడికల్ కిట్లు కూడా కానరావు... ఇంకేముంది మండుటెండలో సొమ్మసిల్లిపోతున్న కూలీలు.. ఇదీ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల తీరు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలకు క్షేత్ర స్థాయి పరిస్థితులు అద్దం పడుతున్నాయి.

గొంతెండిపోతోంది.. భూమి కాడనంటోంది..

- మండుటెండలో సొమ్మసిల్లిపోతున్న ఉపాధి కూలీలు
- వేసవి అలవెన్సులు, తాగునీటి సౌకర్యానికి కోత
- ఆందోళనలో కూలీలు

ప్రజాశక్తి - జామి

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నిర్మూలనతోపాటు పేదలకు పని భద్రత కల్పించాలన్న లక్ష్యంతో ఉపాధి హామీ పనులకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. కానీ నేడు ఉపాధి హామీ పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపహాస్యం చేస్తున్నాయి. ఇప్పటికే ఉపాధి నిధులను ఏటా కోత విధిస్తున్న కేంద్రం.. వేసవి ఎండలో పనిచేసే కూలీలకు అందాల్సిన వేసవి రాయితీలను కూడా కోత పెట్టింది. చివరికి పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యాన్ని కూడా లేకుండా చేసింది. జామి మండలంలో 25 పంచాయతీలకు గానూ, 12,500 జాబ్‌కార్డుల ద్వారా సుమారుగా 25 వేల మంది వరకు కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే గతేడాది 5,40,678 పనిదినాలు నమోదు చేసి, 725 కుటుంబాలకు మాత్రమే 100 రోజులు పని కల్పించారు. దీంతో ఈ ఏడాది 7.5 లక్షల పని దినాలు పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నారు. గత ఏడాది సరాసరి వేతనంగా ప్రభుత్వం రూ.257కు రూ.231 వేతనం కూలీలకు నమోదు చేసింది. కానీ ఈ ఏడాది వేసవి ఎండలకు కూలీలు పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

కానరాని టెంట్లు

ఉపాధి పనులు చేయాలంటే గ్రామాలకు సుదూర ప్రాంతాల్లో ఉన్న చెరువులకు చేరుకోవాలి. ప్రభుత్వం నిర్దేశించిన వేతనం నమోదు కావాలంటే కూలీలు రెండు పూటలా పనులు చేయాలని అధికారులు చెబుతున్నారు. ఉదయం ఆరు గంటలకు బయలుదేరి పని ప్రదేశాలను వెళ్లడానికి కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి. తీరా అంత దూరం నడిచాక, ఎండలో అక్కడ నిలువ నీడ లేకపోవడంతో కూలీలు వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. కనీసం తాగడానికి నీరు అందుబాటులో లేని దుస్థితి. ఈ నేపథ్యంలోనే కూలీలు నరకయాతన అనుభవిస్తున్నారు. కనీసం మెడికల్ కిట్లు కూడా పని ప్రదేశాల్లో కనిపించడం లేదని కూలీలు వాపోతున్నారు.

వేసవి రాయితీల్లో కోత

గత ప్రభుత్వంలో వేసవి రాయితీ కింద కూలీలకు అదనపు అలవెన్స్ అందజేసేవారు. ఎండాకాలంలో కూలీలు పనులు చేయలేరు కాబట్టి... కొంత అదనపు అలవెన్స్ కింద అందజేసేవారు. వేసవి మూడు నెలల్లో 20 నుంచి 30 శాతం అదనపు పని కలిపేవారు. కానీ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వేసవి అలవెన్సులు కోత విధించింది. తాగునీటి సదుపాయం, గునపాలు, పారలు.. ఇలా కూలీలకు అవసరమైన సదుపాయాలు లేకుండా చేసింది. ఈ నేపథ్యంలోనే ఉపాధి పనులు నరకయాతనగా ఉన్నాయని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేసవి అలవెన్సులు అమలు చేయాలి

ఉపాధి పనులు చేసే కూలీలకు ప్రభుత్వం గతం మాదిరిగా వేసవి అలవెన్సులు అమలు చేయాలి. వేసవి వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు కూలీలను రెండు పూటలు కాకుండా ఒకే పూట పనులు నిర్వహించాలి. ప్రిమెజర్మెంట్ ద్వారా కూలి రూ.300కు పైగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధి నిధులు దారిమళ్లించకుండా కూలీల మట్టి పనులకే అత్యధిక నిధులు ఖర్చు పెట్టేలా చర్యలు తీసుకోవాలి. కనీసం వేసవి ఎండల నుంచి బయటపడేలా టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. లేదంటే కూలీలు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది.

– మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఎదురుచూపులే!

- ఆర్థిక సంవత్సరం ముగిసినా చెల్లించని బిల్లులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు
- రావాల్సింది రూ.19 కోట్లకు పైగా.. చెల్లించింది రూ.1.68 కోట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. 14వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధులు చెల్లిస్తారని ఆశగా చూసిన కాంట్రాక్టర్లపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. రాష్ట్ర ప్రభుత్వం 14వ ఆర్థిక బిల్లులు పెండింగ్ ఉంటే వెంటనే సిఎఫ్ఎంఎస్‌లో పెట్టాలని చెప్పడంతో మార్చి నెల 28, 29 తేదీల్లో అర్ధరాత్రి వరకు కాంట్రాక్టర్లు, నగర పాలక సంస్థ అకౌంట్ విభాగం సిబ్బంది పనిచేసి బిల్లులు అప్‌లోడ్ చేశారు. గతేడాది మే నుంచి ఈ ఏడాది మార్చి వరకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందని ఆశతో ఎదురు చూశారు. మార్చి నెల ముగిసింది. ఏప్రిల్ వచ్చి నాలుగు రోజులు గడిచినా పైసా కూడా కాంట్రాక్టర్లకు చెల్లించలేదు. దీంతో రోజూ ఉదయం, సాయంత్రం నగరపాలక సంస్థ చుట్టూ కాంట్రాక్టర్లు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. విజయనగరంలో సుమారు 18 మంది కాంట్రాక్టర్లకు గతేడాది మే నుంచి అన్ని రకాల బిల్లులు కలిపి రూ.19 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. 14వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.7.40 కోట్లకు గాను మార్చి నెల చివరిలో కేవలం రూ.1.68 కోట్లు మాత్రమే విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొంది. ఇంకా కాంట్రాక్టర్లకు సాధారణ నిధులు నుంచి రూ.9.98 కోట్లు, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.73 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.86 కోట్లు రావాల్సి ఉంది. ఈ నెల మూడో తేదీ వరకు ప్రభుత్వం బిల్లులు వేస్తుందని కాంట్రాక్టర్లు ఎదురు చూశారు. అప్పటికే బిల్స్ వెబ్‌సైట్ కూడా ఆపేయడంతో మళ్లీ ఒక్కసారిగా కాంట్రాక్టర్లు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో వస్తాయో రావో?, మళ్లీ వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే పెట్టిన బిల్లులు ఆమోదిస్తారో, రిజెక్ట్ చేస్తారో? స్పష్టమైన సమాచారం లేకపోవడంతో కాంట్రాక్టర్లు, నగరపాలక సంస్థ అకౌంట్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

గతేడాది మే నెల నుంచి బిల్లులు చెల్లించకపోతే ఎలాగని, చేసిన అప్పుల వడ్డీలకు వచ్చే డబ్బులు చాలవని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఏమి చేయాలో తోచక నగరంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. చివరికి అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్లకు వడ్డీలకు డబ్బులిచ్చి పనులు చేయించాల్సిన పరిస్థితి నగరంలో నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికే ఏడాది కాలంగా నిలిచిపోయిన తమ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. ఇదే విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కి, రాష్ట్ర ఉన్నతాధికారులకు, చివరికి మంత్రి బొత్స సత్యనారాయణకు కూడా వినతులిచ్చారు. కాంట్రాక్టర్ల బిల్లులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందో వేచి చూడాల్సిందే.

మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టాలి

విజయనగరం : మాదక ద్రవ్యాల వాడకాన్ని జిల్లాలో పూర్తిగా అరికట్టాలని, వీటి రవాణాపై దృష్టిసారించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. మాదక ద్రవ్యాలను అరికట్టడం ఒక సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ పరిగణించాలని సూచించారు. మంగళవారం జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మెడికల్ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాల విద్యార్థులు పరీక్షల కారణంగా ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని, వారిపై ఒక కన్నేసి ఉంచాలని, అందుకు వాలంటీర్ల సహకారం తీసుకోవాలని చెప్పారు. ఎంపిడిఒ, ప్రజాప్రతినిధుల సహకారంతో అవగాహన కలిగించడానికి ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలన్నారు. గృహాలలో ఎక్కడైనా హింస జరుగుతున్నట్లు వైద్యుల దృష్టికి వచ్చినా , అనుమానాస్పద ప్రవర్తన కలిగి ఉన్నా వారికి కౌన్సెలింగ్ చేయాలన్నారు. బడిమానేసిన విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా, వారికి ఏదో ఒక అంశంలో నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించాలని సూచించారు.

ప్రతిష్టను పెంచండి

- రీ సర్వేలో మొదటి స్థానం సాధించాలి : జెసి మయూర్ అశోక్
- సివిల్ సర్వీస్ రూల్స్‌పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

శిక్షణలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

సమర్థవంతమైన పనితీరుతో రెవెన్యూ, సర్వే శాఖల ప్రతిష్టను పెంచాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ కోరారు. రీసర్వేలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఎపి సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్‌పై సర్వేయర్లు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ రీసర్వేలో మన జిల్లా 60 శాతం పూర్తి చేసుకొని ఇప్పటికే ముందంజలో ఉందన్నారు. మొత్తం ప్రక్రియను త్వరగా పూర్తిచేసి, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని కోరారు. దాదాపు వందేళ్ల తరువాత చేపట్టిన రీసర్వే ప్రక్రియలో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం ఎంతో ముందుందని చెప్పారు. దీనికి సచివాలయ వ్యవస్థే కారణమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో కూడా ఉన్నత విద్యార్హతలతో కూడిన సుశిక్షితులైన సిబ్బంది అందుబాటులో ఉండటం వల్ల ఏ ప్రభుత్వ కార్యక్రమాన్ని అయినా విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని చెప్పారు.

ఎన్నో వివాదాలకు భూములే కారణమని, రీసర్వే పూర్తి అయితే చాలా వివాదాలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది తమ జాబ్ చార్ట్ పట్ల, విధులు, నిబంధనలు, చట్టాలపై పట్టు పెంచుకోవాలన్నారు. సర్వేయర్లు ఒకరకంగా లీగల్ అసిస్టెంట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వే శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మనకు ఎంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని, దానిని వినియోగించుకోవాలని జెసి కోరారు. ఈ శిక్షణలో కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ సూర్యనారాయణ, సర్వేశాఖ ఎడి టి.త్రివిక్రమరావు, జిల్లా శిక్షణ కేంద్రం మేనేజర్ ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా మెలగాలి

ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాల్సి ఉంటుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. శిక్షణలో కలెక్టర్ మాట్లాడుతూ చట్టాలను, ప్రభుత్వ నిబంధనలను ఉద్యోగులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. తాము ప్రభుత్వ ప్రతినిధులమన్న విషయాన్ని నిరంతరం మననంలో ఉంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరికీ వృత్తిపరమైన క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. పనిలో మమేకం కావాలని, ఆ పనిలోనే ఆనందాన్ని పొందాలని కలెక్టర్ సూచించారు.

ముగిసిన శంకుస్థాపన వారోత్సవాలు

రూ.2.70 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం : డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శంకుస్థాపన వారోత్సవాల్లో భాగంగా రూ.2.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. శంకుస్థాపన వారోత్సవాల ముగింపు మంగళవారం నిర్వహించారు. చివరి రోజు దండుమారమ్మ కోవెల, కామాక్షినగర్, వివేకానంద కాలనీ, చెంచుల కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులు, కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. చేపట్టిన పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఈ నెల ఆరో తేదీ నుంచి ప్రారంభ వారోత్సవాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే పూర్తయిన పనులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ప్రజలకు తాగునీరు, మౌలిక సదుపాయాలు, లైట్లు, రహదారులు వంటివి కల్పిస్తూనే నగర ప్రధాన జంక్షన్ల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఈ నెల ఆరో తేదీన ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద ఉప్పు సత్యాగ్రహం స్మారకంగా దండి మార్చ్ విగ్రహాలను మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ స్థాయికి తగ్గ హంగులను కల్పించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతిదేవి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వివిఎస్ ప్రసాద్, కార్పొరేటర్లు దాసరి సత్యవతి, సైలాడ సత్యనారాయణ, వంతరం సురేష్, నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో కోతలు.. నెరవేరని లక్ష్యాలు

- కనీస వేతనం, ఉద్యోగ భద్రత కరువు
- కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిర్వీర్యమవుతున్న ఐసిడిఎస్
- నేడు చలో ఢిల్లీకి తరలిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

రక్తహీనతను నివారించి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల మరణాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌ను తీసుకొచ్చింది. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం దీని ముఖ్య ఉద్దేశం. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు బాలామృతం పంపిణీ చేస్తారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ నడిపి మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందజేయడంతోపాటు ఆటలు ఆడిస్తూ చదువు చెపుతున్నారు. అలాంటి కీలకమైన ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం నిధుల్లో కోత పెట్టి నిర్వీర్యం చేయాలని చూస్తోంది.

యాప్‌లతో పని ఒత్తిడి

అంగన్వాడీ కేంద్రాల్లో రోజుకొక యాప్ అమలు చేయడంతో అంగన్వాడీ కార్యకర్తలపై పని ఒత్తిడి పెరుగుతుంది. అంగన్వాడీ కేంద్రాలలో పోషన్ ట్రాక్, పోషణ్ పక్వాడా, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ యాప్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఫొటోలు అప్‌లోడ్ చేయాలంటున్నా నెట్‌వర్క్ సమస్య ఉండడంతో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగడం లేదు. కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదు. అనేక రకాల యాప్‌లు ప్రవేశపెట్టి పని ఒత్తిడి పెంచుతున్న చాలీచాలని వేతనాలతో పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

రాజకీయ వేధింపులతో అవస్థలు

అంగన్వాడీలపై రోజురోజుకు రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ వేధింపులతో అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో కొంతమంది అంగన్వాడీలు అనారోగ్యం బారిన పడుతున్నారు. రాజకీయ వేధింపులు అంగన్వాడీలు కోరుతున్నారు.

సంస్థాగతంగా బలోపేతం చేస్తేనే..

ఐసిడిఎస్‌ను ప్రభుత్వం సంస్థాగతంగా బలోపేతం చేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేస్తున్నారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత లేదు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడం లేదు. ప్రభుత్వం స్పందించి ఐసిడిఎస్‌ను సంస్థాగతం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్వాడీలు కోరుతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ వర్తింపజేయాలని, పింఛను సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మెనూ మార్చి బడ్జెట్ పెంచాలని కోరుతున్నారు. ఏళ్ల తరబడి వినతులిచ్చినా, పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో బుధవారం చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి అంగన్వాడీ కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్వాడీలు (ఫైల్)

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తాం. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ చేపడుతున్నాం.

– పి.శంకరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు

ఆన్‌లైన్ బెట్టింగ్ గుట్టు రట్టు

10 మంది అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణ పోలీసులు ఆన్‌లైన్ బెట్టింగ్ గుట్టు రట్టు చేశారు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాస్తున్న 10 మందిని అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు చెప్పారు. స్థానిక పోలీసుస్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా పెట్టి 10 మందిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి టీవీ, సెల్ ఫోన్, రూ.34 వేలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామన్నారు. కోట్ల ఉషాకిరణ్, చిత్రపు సాయిప్రకాశ్, రాయపురెడ్డి శోభన్ బాబు, కె.హరికృష్ణ, అల్లాడ రమేష్, పి.భాస్కరరావు, పి.గణేష్, ఊళ్ల మహేష్, ఎన్.శివ, కె.పైడిరాజు, బి.అప్పారావును అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరంతా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ వేసి వారానికి ఒకరోజు లావాదేవీలు జరుపుతారని తెలిపారు. 20 మంది బెట్టింగ్ రాయుళ్లపై నిఘా పెట్టగా 10 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. బెట్టింగ్ వల్ల జీవితాలు నాశనమవుతాయని, పిల్లల నడవడికపై తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. బెట్టింగులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

చెక్కును అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అర్హతే ప్రామాణికంగా, అక్క చెల్లెమ్మల ఆనందమే అంతిమ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఎలాంటి మధ్యవర్తిత్వం లేని పూర్తి పారదర్శకతతో కూడిన పాలన రాష్ట్రంలో సాగుతోందని ఉద్ఘాటించారు. వైఎస్ఆర్ ఆసరా మూడో విడత సంబరాల్లో భాగంగా స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. సిఎం జగన్ చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు పాలాభిషేకం చేశారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ ఆసరా మూడో విడతలో నగరంలోని 3,381 గ్రూపుల్లో 33,113 మందికి రూ.24.90 కోట్లు, గ్రామీణ ప్రాంతంలోని 794 గ్రూపుల్లోని 8,413 మందికి రూ.5.15 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. మహిళలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, తద్వారా ఆర్థిక స్వావలంబన కలుగుతుందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని కితాబిచ్చారు. కార్పొరేషన్ కార్యాలయ సమీపంలో మహిళలకు ప్రత్యేకంగా పార్కు నిర్మిస్తున్నామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కంటి వెలుగు పథకంలో భాగంగా డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా పలువురు విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. ఆసరా వేడుకల్లో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతిదేవి, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, మెప్మా పీడీ సుధాకర్, ప్రత్యేక అధికారి అరుణ కుమారి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయాన్ని దర్శించుకున్న కోలగట్ల

గాజులరేగలోని ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు జమ్ము మధు, నాయకులు కనుగుల రాజా, పాండ్రంకి గణేష్, అట్టాడ శ్రీను, జామాన శ్రీను, బూడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే లాజిస్టిక్ సేవలు

ఆర్‌టిసి విజయనగరం జోన్ ఇడి రవికుమార్

ప్రజాశక్తి-విజయనగరం కోట

లాజిస్టిక్స్ ఆన్‌లైన్ బుకింగ్ సేవలను ప్రారంభిస్తున్న ఇడి రవికుమార్

వినియోగదారుల ఆకాంక్షల మేరకు ఎపిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్స్ సేవలను మరింత విస్తృతం చేయడంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా ఇకపై ఇంటి వద్ద నుంచే చేసుకోవచ్చని విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో లాజిస్టిక్స్ ఆన్‌లైన్ బుకింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సేవలు మంగళవారం నుంచి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ పట్టణాలకు అందుబాటులో ఉంటాయన్నారు. వినియోగదారులు తమ ఇంటి వద్ద నుంచి www.shipmantra.com లేదా www.apsrtclogistics.in ద్వారా డోర్ పికప్, డోర్ డెలివరీ సౌకర్యం పొందవచ్చన్నారు. 50 కేజీల వరకు, బస్టాండ్ నుంచి ఏడు కిలోమీటర్ల పరిధిలో పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జోన్ కమర్షియల్ సిటిఎం కె.వెంకటరావు, డిపిటిఒ కె.శ్రీనివాసరావు, నెక్ రీజియన్ ఎటిఎం హెచ్.దివ్య, విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

6న పిడిఎస్ బియ్యం వేలం

కొత్తవలస : మండలంలో పట్టుకున్న పిడిఎస్ బియ్యాన్ని ఈనెల 6న వేలం వేయనున్నట్లు సిఎస్‌డి టి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వీరభద్రపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉన్న 67.22 క్వింటాలు పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనపరుచుకొని ఎంఎల్ఎస్ పాయింటుకు తరలించామన్నారు. ఆ బియ్యాన్ని వేలం వేస్తామన్నారు. సదరు వేలంపాటలో పాల్గొనుటకు ఆసక్తి గల వారు ముందుగా రూ.25వేలు ధరావత్తు ముందుగా చెల్లించాలన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

బొబ్బిలి : తెర్లాం మండలం పెరుమాలి గ్రామానికి చెందిన శ్రీశయన సెగిడి కులానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. మంగళవారం బొబ్బిలి కోటలో ఆ గ్రామ మాజీ ఎంపిటిసి కుప్పిలి జగ్గారావు, జంపాన విశ్వనాథరాజు ఆధ్వర్యంలో టిడిపి మండల అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, నర్సుపల్లి వెంకటేష్ సమక్షంలో 70 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి బొబ్బిలి నియోజకవర్గం ఇంఛార్జి బేబినాయన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శనపతి లక్ష్మణరావు, సత్యనారాయణ, ఆదినారాయణరావు, శంకర్రావు, పట్నాన రామారావు, బుంగ సత్యనారాయణ, ముంగి తౌడు, కురమాన తౌడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి టిక్కెట్టు నాదే : శంబంగి

బొబ్బిలి : 'బొబ్బిలి వైసిపి టిక్కెట్టు నాదే.. గెలుపు నాదే' నని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. బొబ్బిలి నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా తాను పోటీ చేసి గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో విజయం సాధిస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారానికి పని చేస్తున్నానని చెప్పారు. తమ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు చెప్పారు. నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని ప్రతిపక్ష నేత బేబినాయన చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 6.16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

బొబ్బిలి : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని నారాయణప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు అన్నారు. పాఠశాలలో మంగళవారం ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త జగ్జీవన్ రామ్ 116వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బీహార్‌లోని వెనుకబడిన వర్గాల నుండి వచ్చి రాజకీయ వేత్తగా అంచెలంచెలుగా ఎదిగి దేశ ప్రజలకు అనేక సేవలు అందించారన్నారు. భారత పార్లమెంటులో 40 ఏళ్ళు వివిధ మంత్రి పదవులను నిర్వహించటమే కాకుండా భారత దేశ ఉప ప్రధానిగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాశ్, శ్రీనివాసరావు, మురళి, మహేష్, రామ చంద్ర రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒత్తిడిని దూరం చేయాలి

గుర్ల : పరీక్షల రాసే విద్యార్థులు ఒత్తిడిని దూరం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్ పర్సన్ కేసలి అప్పారావు అన్నారు. మంగళవారం గుర్ల కెజిబివి కేంద్రాన్ని ఆయన సందర్శించి విద్యార్థినిలతో మాట్లాడారు. మిగతా పరీక్షలకు ఎలా సిద్ధంగా ఉన్నారో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పరీక్షల సమయంలో ప్రశాంత బుర్రగా చదువుకొని ఆరోగ్యం పట్ల, ఆహార అలవాట్ల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కెజిబివి సిబ్బంది విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ భాను ప్రకాష్, ప్రిన్సిపల్ జానకి, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

శృంగవరపుకోట : టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లును పంపిణీ చేశామని టిబి సూపర్ వైజర్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద అరబిందో ఫార్మసీ హైట్రో డ్రగ్స్ దాతల సహకారంతో కొట్టం పిహెచ్‌సి వైద్యాధికారుల ఆధ్వర్యంలో టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొట్టం, పెదమజ్జిపాలెం, జామి, అలమండ, గంట్యాడ పిహెచ్‌సిల పరిధిలోగల పేద టిబి రోగులకు ఈ కిట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ టి. శంకర్రావు, టి రామకృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మంజుల

వంగర: బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం రాజాంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బి మంజుల, ఉపాధ్యక్షునిగా భవానీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డోల కిరణ్, సహాయ కార్యదర్శిగా నక్క మురళీధర్, కోశాధికారిగా అల్లెన సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంజుల అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల ఆమెకు పలువురు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం

భోగాపురం : మండలంలోని సవరవల్లి గ్రామంలో బ్రెయిన్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న బోర కృష్ణకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో సవరవల్లి టిడిపి ఉపాధ్యక్షులు చల్ల రమణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల గురుమూర్తి, మౌళి వర్మ, మామిడి బాలకృష్ణ, మండల పృధ్వీ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యుబి వద్ద మురుగు తొలగింపు

నెల్లిమర్ల : నగర పంచాయతి పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మురుగు తొలగింపు పనులు చేపట్టారు. మంగళ వారం స్థానిక 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ తన సొంత నిధులతో రామ తీర్థం వైపు వెళ్లే అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద గుంతల్లో మురుగు నీరు తొలగించే పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వార్డు పరిధిలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గుంతలు ఏర్పడి వాహన రాకపోకలు, ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో తన సొంత నిధులతో జెసిబి ఏర్పాటు చేసి మురుగును, నీటిని తొలగించే ఏర్పాటు చేశామన్నారు.

పోషకాహారంపై అవగాహన

డెంకాడ : మండలంలోని చింతలవలసలో పోషకాహారం పై గర్భిణులు, కిషోర బాలికలకు, బాలింతలకు మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి పిన్నింటి తమ్ము‌నాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పోషక పదార్థాలను తల్లులు గర్భిణీలు బాలింతలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఓ టి.ఎస్తేరు రాణి, సూపర్‌వైజర్లు ఏ సత్యవతి, శైలజ రాణి, శశికళ, మహిళా పోలీసులు గౌరీ, సుభాషిణి, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

డెంకాడ : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూములను రక్షించాలని, వాటిపై అక్రమార్కుల కన్ను పడి కబ్జాకు పాల్పడుతున్నారని పిఎసిఎస్ ఛైర్మన్ రొంగలి కనకసింహాచలం, గ్రామ సర్పంచ్ పతివాడ గౌరి, గ్రామస్తులు మంగళవారం కలెక్టరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వే ఇప్పుడే ప్రారంభమైందని ఈ సర్వేలో ప్రభుత్వ భూమిని, డీపట్టా భూమిని, దేవస్థానం భూములను, ల్యాండ్ సీలింగ్ భూమిని గుర్తించి ప్రభుత్వం స్వాధనం చేసుకోవాలని కోరారు. ముందు కబ్జాకు గురవుతున్న ప్రభుత భూముల్లో సర్వే జరిపిన తరువాత రైతులకు సంబంధించిన భూముల్లో సర్వే చేయాలని కోరారు.

పేదలకు సేవ చేయడంలో ఎంతో తృప్తి

శృంగవరపు కోట : పేద ప్రజలకు సేవ చేయటంలో ఎంతో తృప్తి కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షులు మద్ది మాణిక్యం అన్నారు. పేదల కోసం ఏర్పాటు చేసిన సహాయ నిధి ద్వారా పేద మహిళలకు, వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు, పిల్లలకు బట్టలు, రొట్టెలు, బిస్కెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ ఎంత సంపాదించినా మనతో రాదని, మనం చేసిన సేవలు, మంచి పనులు ప్రజల్లో ఉండి పోతాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కెచాంద్ బేబి, ఆదిమూలం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

శృంగవరపు కోట : మండలంలోని మూల బొడ్డవర ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి పి సత్యనారాయణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న గోరుముద్దను పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన మెనూ సక్రమంగా పాటించాలని ఆయన ఆదేశించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- గంట్యాడ

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని కొటారబిల్లి జంక్షన్‌లో మంగళవారం మూడవ విడత వైయస్సార్ ఆసరా పథకం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 17 గ్రూపులకు గాను రూ.9.23 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు పాలన సాధ్యమైందని ఏ పని కావాలన్నా మండల కేంద్రాల చుట్టూ జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, ఎఎంసి ఛైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, తహశీల్దార్ ప్రసన్న రాఘవ, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: డ్వాక్రా మహిళలలు ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎంపిపి అంబళ్ళ సుధారాణి చేతులు మీదుగా చెక్కును సభ్యులుకు అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆసరా పథకాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాలు డ్వాక్రా సంఘాలను మోసం చేసి వారి డబ్బును ఇతర రంగాలకు తరలించడం జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం మహిళకు ఆర్థిక భరోసా కల్పించడానికి ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టింది కాబట్టి మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో 1082 సంఘాల్లో ఉన్న 11,940 మంది డ్వాక్రా మహిళలకు రూ.7.83కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమళ్ల వెంకట రమణ, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా కమిటి ఛైర్మన్ జమ్ము అప్పలనాయుడు, ఎంపిడిఒ జి.గిరిబాల, తహశీల్దారు కె.వి.రమణ రాజు, వైఎస్ఆర్ కాంతి పథం డిపిఎం బ్యాంకు లింకేజి బి. బంగారమ్మ, ఏరియా కో ఆర్డినేటర్ జి సీతారామయ్య, ఏపిఎం ఎల్. సత్యనారాయణ, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

రేగిడి : మహిళలు స్వావలంబన సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆసరా పథకంలో భాగంగా 1408 మహిళా సంఘాల్లోని 15,017 మహిళా సభ్యులకు రూ. 10.32 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఏ దేశంలో లేని విధంగా మహిళలను ఆసరా పథకం ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలకు లక్షాధికారులు చేసే విధంగా పనిచేస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని మరోసారి గెలిపించాలని కోరారు. విద్యా, వైద్యం ప్రభుత్వానికి రెండు కళ్ళు వంటివని అన్నారు. ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చినవన్నీ అమలు చేశారని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ నాయకుల మాయ మాటలు నమ్మవద్దని అన్నారు. వారి ప్రలోభాలకు మోసపోయొద్దని చెప్పారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంతులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సభ జరుగుతుండగా చాలా మంది మహిళలు తిరిగి ఇంటికి వెళ్లిపోవడంతో చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాలవలస ఇందుమతి, ఎంపిపి ధార అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు, మండల మజ్జి శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు, తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎపిఎం మంగమ్మ, ఎంఇఒ వరప్రసాదరావు, హౌసింగ్ ఎఇ సూర్యప్రకాష్‌రావు, ఎపిఒ హరినాథ్, మండల వైసిపి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



రేగిడి: కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు ఛైర్మన్ శ్రీనివాసరావు



గంట్యాడ: మహిళా సంఘ సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

జామి: టిడిపి ప్రభుత్వం గతంలో మహిళలను మోసం చేస్తే, వైసిపి అక్కున చేర్చుకుందని, మహిళల కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గజపతినగరం, శృంగవరపుకోట ఎమ్మెల్యేలు అప్పలనరసయ్య, శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని యల్లారమ్మ గుడి ప్రాంగణంలో నిర్వహించిన వైయస్సార్ ఆసరా సంబరాలలో ఎమ్మెల్యేలు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మూడో విడత రుణమాఫీ అందజేశారన్న విషయాన్ని ప్రతి మహిళ గుర్తు పెట్టుకోవాలని పిలునిచ్చారు. మండలంలో మొత్తం 1247 స్వయం సహాయ సంఘాలకు రూ.8.12కోట్ల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో మీ యొక్క అభిమానాన్ని జగనన్న పై చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి మండల అధ్యక్షులు గొర్లే రవి కుమార్, స్టేట్ డైరెక్టర్ సత్యారావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు రాజేశ్వరరావు, డిసిసిబి డైరెక్టర్ పాడ్రంకి సంజీవి, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, జెసిఎస్ కన్వీనర్ శీరెడ్డి చంద్ర నాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్యాబ్‌లను పూర్తిస్థాయిలో వినియోగించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఎంతో విలువైన కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేసిందని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలని ఉపాధ్యాయులను, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఈ కంటెంట్‌లో ఉన్న ప్రతీ సబ్జెక్టుకు సంబంధించిన క్లాస్ టెస్టును విద్యార్థులు చేత చేయించాలని సూచించారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం, ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత విద్యపట్ల వారి భవిష్యత్ ప్రణాళికలను తెలుసుకున్నారు. కేవలం ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి కోర్సులే కాకుండా, సిఎ, లా తదితర ఎన్నో ప్రత్యామ్నాయ అవకాశాలు ఉన్నయని చెప్పారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని, ఉపాధ్యాయులకు సూచించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను తనిఖీ చేశారు. వాటి వినియోగం, సబ్జెక్టు టెస్టుల నిర్వహణ, టెస్టుల్లో వచ్చిన మార్కులపై ఆరా తీశారు. ట్యాబ్ ద్వారా అందిస్తున్న కంటెంట్ అర్థం అవుతుందా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. డిక్షనరీ వినియోగించే విధానాన్ని పరిశీలించారు. బాగా చదువుకొని, మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో ఎంపిడిఒ జి.గిరిబాల, ఎంఇఒ ఎ.కృష్ణారావు, కెజిబివి ప్రిన్సిపాల్ బి.ఉమ పాల్గొన్నారు.

కెజిబివి తనిఖీలో జిల్లా కలెక్టర్

ట్యాబ్‌లపై పిల్లలతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ సూర్యకుమారి

ఇవిఎం గోదాం తనిఖీ

స్థానిక మిమ్స్ సమీపంలో ఇవిఎం గోదాంను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి మంగళవారం తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నెల్లిమర్ల తహశీల్దార్ రమణ రాజు, ఎంపిడిఒ జి.గిరిబాల, మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ నీలకంఠ రావు, లోక్‌సత్తా నాయకురాలు రాయి పద్మావతి, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - రామభద్రపురం

వేసవి కాలంలో వచ్చే వివిధ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి దిలీప్‌కుమార్ సూచిం చారు. మంగళవారం పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో వచ్చే డయోరియా, వడదెబ్బ ఎక్కువ వచ్చే అవకాశాలున్నాయని వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు వివరించాలన్నారు. సుఖ ప్రసవం, తల్లీ బిడ్డా సంరక్షణ, ప్రభుత్వ పథకాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ఆయా గ్రామాలకు వచ్చే 104 వాహన సేవలో ఆశా, ఎఎన్ఎంలు తగిన విధంగా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శిరీష, సిహెచ్‌ఒ చిన్నికృష్ణారావు, హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరక ముడిదాం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన "కిల్కారీ' అనే వాయిస్ కాల్ ద్వారా మాతా శిశు ఆరోగ్యానికి సంబంధించి, గర్భిణులు, భాలింతలు, శిశువులు ఆరోగ్యం పై మరింత దృష్టి సారించ వచ్చునని గర్భం పిహెచ్‌సి వైద్యాధికారి అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పిహెచ్‌సిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గర్భవతిగా వున్నపుడు స్థానిక ఏఎన్ఎం దగ్గర గర్భస్థ వివరాలు నమోదు చేసుకునేటపుడు ఇచ్చిన మొబైల్ నెంబర్‌కు ఈ కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయని తెలిపారు. గర్భవతుల్లో తలెత్తే సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశాలు వస్తాయని, మహిళలు గర్భం దాల్చిన నాల్గవ నెల నుండి బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు డబ్బయ్ రెండు సార్లు వాయిస్ కాల్ సందేశాలు వస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపిహెచ్ ఏవోస్, సూపర్ వైజర్స్, ఏఎన్ఎమ్స పాల్గొన్నారు.

మెరకముడిదాం: సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

'జగనన్నే మా భవిష్యత్తు' పై సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి, జాకేరు, ఆతవ గ్రామ సచివాలయాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుండి 14వ తేదీ వరకూ ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరించడంతో పాటు వారి అనుమతితో వారి ఇంటి వద్ద జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అంటించాలన్నారు. అనంతరం గృహ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్లకు పలు సూచనలు చేసి కిట్టును పంపిణీ చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి అడప ఈశ్వరరావు, మండల వైసిపి సర్పంచుల అధ్యక్షులు ఎన్. వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షుడు జగ్గుబాబు, మండల వైసిపి కన్వీనర్ల పర్యవేక్షణ అధ్యక్షుడు బోజంకి శ్రీను, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి సత్యవంతుడు

రోజువారీ మార్కెట్ వేలం పాట

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వేపాడ రోజువారి మార్కెట్ వేలం పాటలో రూ.42,500, వల్లంపూడి రోజువారి మార్కెట్ వేలం పాటలో రూ. 45వేలు పంచాయతీకి చెల్లించేందుకు ఆమోదించామని పంచాయతీ అధికార సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల్లో మంగళవారం రోజువారి వేలం పాట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వేపాడ సర్పంచ్ ఎం అర్జునమ్మ, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, వల్లంపూడి సర్పంచ్ రుద్ర అంజలి, కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్, రెవెన్యూ శాఖల తీరుపై ధ్వజం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల సర్వ సభ్య సమావేశంలో విద్యుత్, రెవెన్యూ, ఉపాధి హామీ పథకం పై సభ్యులు ధ్వజ మెత్తారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు ముఖ్య అతిథిగా హాజరైన సమావేశంలో అధికార పార్టీకికి చెందిన ప్రజా ప్రతినిధులు శాఖల పని తీరుపై అధికార్లను నిలదీశారు. ముఖ్యంగా సతివాడలో ఇళ్ల స్థలాలు మంజూరులో తహశీల్దారు నిర్లక్ష్యం చేస్తున్నారని సర్పంచ్ రేవళ్ళ శ్రీనివాసరావు నిలదీశారు. సతివాడ గ్రామానికి చెందిన 16మంది లబ్ది దార్లకు గతంలో ఎంబేరయ్య గుళ్ళ వద్ద స్థలం మంజూరు జరిగిందని అది అటవీ శాఖ భూమి కావడంతో అధికార్లు ఇళ్ళ స్థలాలకు ఇవ్వడం కుదరదని చెప్పారని తెలిపారు. అయితే సతివాడ గ్రామంలో సర్వే నెంబర్ 45/1లో ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ రెవెన్యూ అధికార్లు పట్టాలు మంజూరు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసి ఎమ్మెల్యే, ఎంపిపి దృష్టికి తీసుకు వెళ్ళారు. దీనిపై సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు మాట్లడుతూ ఇళ్ల స్థలాలు మంజూరు ఎందుకు చేయలేదని తహశీల్దారుని ప్రశ్నించి జెసి దగ్గర తేల్చుకుందామని హెచ్చరించారు. తహశీల్దారు, శ్రీరాములు నాయుడు మధ్య వివాదం జరుగుతున్నా ఎమ్మెల్యే మాత్రం మౌనం వహించి నోరు విప్పక పోవడంతో సభ్యులు విస్తుపోయారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించడం లేదని గుషిని ఎంపిటిసి చనమల్ల స్వాతి, బూరాడ పేట, తదితర గ్రామాల్లో వదులుగా ఉన్న తీగలు, విద్యుత్ స్తంభాలు వేయాలని పాలు మార్లు ఎఇ దృష్టికి తీసుకు వెళ్ళినా పరిష్కరించలేదని నిలదీశారు. ఉపాధి హామీ పథకం ద్వారా రావాల్సిన ఇంటి బిల్లులు రావడం లేదని, వేతనాలు కూడా సకాలంలో అందడం లేదని సభ్యులు ధ్వజ మెత్తారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ జమ్ము అప్పల నాయుడు, ఎంపిడిఒ జి. గిరిబాల, తహశీల్దారు కె.వి. రమణ రాజు, ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీ రావు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను నిలదీస్తున్న సతివాడ సర్పంచ్ శ్రీనివాసరావు

'అవంతి'లో ముగిసిన సాంకేతిక శిక్షణ

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీస్ ఇంజనీరింగ్ కాలేజీలో గత రెండు వారాలుగా విశాఖకు చెందిన రిసోర్స్ పర్సన్ కె.రవిశంకర్ ఆధ్వర్యంలో పైథాన్ ప్రోగ్రామింగ్‌పై ఇస్తున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ కంప్యూటర్‌లోని అన్ని లాంగ్వేజ్‌లో పైథాన్ ప్రోగ్రామింగ్ ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. ఎమ్ఎన్‌సి కంపెనీల్లో ఈ లాంగ్వేజ్‌ని ఎక్కువగా వాడుతున్నారని, తద్వారా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని తెలిపారు. ఈ పైథాన్ ప్రోగ్రామింగ్‌ని ఉపయోగించి ఏదైనా ఒక ప్రాజెక్ట్‌ను తక్కువ కాలంలో, తక్కువ ఖర్చుతో వేగంగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఈ 15 రోజుల్లో 3డి అప్లికేషన్స్, రోబోటిక్స్, శాస్త్రీయ, గణితాత్మక వంటి వివిధ అప్లికేషన్స్‌ను అభివృద్ధి చేయడానికి విద్యార్థులకు అవసరమైన సాంకేతిక శిక్షణ ఇచ్చారన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనిల్ కుమార్, హెచ్‌అండ్‌బిఎస్ విభాగాధిపతి జె.అప్పలనాయుడు, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు కక్ష సాధింపే

శృంగవరపు కోట: రాహుల్ గాంధీ పై అనర్హత వేటు మోడీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యేనని కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ఆరోపించారు. మోడీ ప్రభుత్వం రాహుల్ గాంధీ పై విధించిన అనర్హత వేటుకు నిరసనగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి బంగారు నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జై భారత్ సత్యాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రాహుల్ గాంధీ పై తప్పుడు పరువు నష్టం కేసు బనాయించి కేసు, రెండు సంవత్సరాల జైలు శిక్ష వేయించినందుకు, రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటును వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పదాల మణిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీనివాసరావు, నానాజీ, చీమల అచ్చిబాబు, నర్సింగరావు, పి అప్పారావు, గోపి, హెచ్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎనస్తీయాలజీ పాత్ర కీలకం

నెల్లిమర్ల : వైద్య రంగంలో అనస్థియాలజీ పాత్ర చాలా కీలకంగా మారిందని ఆంధ్ర వైద్య కళాశాల ప్రొఫెసర్ ఎ. పద్మజ అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన 'రోల్ అండ్ స్కోప్ ఆఫ్ అనస్తీయాలజీ సర్వీసెస్' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 24.04.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 294.8 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

మహారాజశ్రీ విజయనగరం ఎస్.సి, ఎస్.టి (POA) ACT నాల్గవ అదనపు జడ్జి కోర్టులో
EA-69/2021 EP-357/2019 in O.S.12/2011

బిట్వీన్ :
శ్రీమతి గుజ్జారి నాగేశ్వరి (Died) & ఇతరులు ........D.H.R's

ఎండ్ :
శ్రీమతి కొయ్యాన జయలక్ష్మి (Died) & ఇతరులు ....JDR's

JDR (3) కొయ్యాన చంద్రశేఖర్ S/o ఆనందరావు, వయస్సు 36 సం॥ R/of గోదావరి దేవి నగర్, చీపురుపల్లి విలేజ్ అండ్ మండలం, విజయనగరం డిస్ట్రిక్ట్.

JDR (6) పెందుర్తి శశికాంతి W/o దేముడు, మేనేజరు H.P.C.L., D/o ఆనందరావు, వయస్సు 32 సం॥ R/of గోదావరి దేవి నగర్, చీపురుపల్లి విలేజ్ అండ్ మండలం, విజయనగరం డిస్ట్రిక్ట్.

ప్రకటన

పైన పేర్కొన్న D.H.R సదరు డిక్రీకి సంబంధించి సొమ్ము వసూలు నిమిత్తము Or 21 Rule 54 C.P.C ప్రకారం అమలులో దాఖలు చేసిన షెడ్యూలు స్థిరాస్తిని జప్తు కోరుతూ పై నెంబరు గల అమలు మీపైన దాఖలు చేసి యున్నారు. పై కోర్టువారి ఆర్డరు ప్రకారం ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కనుక సదరు పిటీషనుపై మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్నయెడల మీరు స్వయంగా కాని, వకీలు ద్వారా కాని **తే 20-04-2023దీన ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్టువారి యెదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని యిందు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
బెల్లాన రవి
D.H.R తరుపు న్యాయవాది
విజయనగరం

నేరాలు ఘోరాలు

గృహోపకరణాలు దగ్ధం

శృంగవరపు కోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో కాపుగంటి సరస్వతి రేకులషెడ్డు ఇంటిలో విద్యుత్ షార్క్ సర్క్యూట్ సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో గ్రామా నికిచెందిన సరస్వతి తన ఇంట్లో వంట చేస్తున్న సమయంలో ఈమె రేకుల షెడ్డులో వున్న ప్రిజ్ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చేలరేగి ఫ్రిడ్జ్‌కు అంటుకున్నాయి. అదేసమయంలో ప్రిజ్ వెనుకభాగంలో వున్న సిలిండర్ పేలిపోయింది. మంటలు వ్యాపించి చీరలకు అంటుకోవడంతో ఇంట్లో వుండిపోయిన తన తల్లిను ఆమె కుమారుడు నాగరాజు ప్రమాదం అని తెలిసిన లోపలకి వెళ్లి బయటకు తీసుకోచ్చేయడంతో ప్రాణపాయం తప్పింది. ఇదే సమయంలో నాగరాజు చేతులు స్వల్పంగా కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకోని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

గాయపడిన వ్యక్తి మృతి

శృంగవరపుకోట : పట్టణంలోని జలగల బంధ వద్ద సోమవారం రాత్రి ఎస్ కోట నుంచి బొడ్డవర వెళుతున్న తండ్రి కొడుకులకు జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్రంగా గాయపడిన తండ్రి కుంచు చిన్నయ్య చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ కోట నుంచి మోటారు బైక్ పై బొడ్డవర వైపు వెళుతున్న తండ్రి కొడుకులు పట్టణంలోని జలగలబంద వద్ద సిమెంట్ పైపులను ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలు కాగా తండ్రి చిన్నయ్య తలకు తీవ్ర గాయం కావడంతో ఆయనను విజయనగరం జిల్లా కేంద్రస్పత్రికి తరలించారు. అక్కడ చిన్నయ్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో జిల్లా ఆసుపత్రి నుంచి మంగళవారం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడని ఆయన తెలిపారు.

టైరు బళ్లపై కేసు నమోదు

శృంగవరపుకోట : టైరు బళ్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాలపల్లి వద్ద గల గోస్తని నది నుంచి మంగళవారం తెల్లవారు జామున టైరు బండ్లుతో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో కాపు కాసి ఇసుకతో వస్తున్న ఆరు టైరు బండ్లను స్వాధీనం చేసుకొని బల్ల యజమానులపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.